# ★ మొగసాలనెక్కిన మగువ ★

ఆపిల్ల నరేసని, పెళ్ళివారి దగ్గరకు వెళ్ళి బంగారపు బొమ్మలా కదలకుండా మెదలకుండా కూర్చుంది. సిగ్గుచేత ఆలా కూర్చుంది కాబోలు ననుకున్నారు పెళ్ళివారు. తరువాత పాటపాడ మన్నారు. అది విని ఆపిల్ల అమ్మ చెప్పిన మాటలూ, పక్కింటివారి పెంపుడు చిలుకమాటలు జ్ఞాపకం తెచ్చుకుని, "అక్కయ్యా! కూర! కూర! కూర!!!" అని అదేపనిగా అరవటం ఆరంభించింది. అది విన్న ఆపెళ్ళివారు, యిది పిచ్చిపిల్ల కాబోలు అనుకుని వెనక్కి వెళ్ళిపోయేరు. కూతురు తెలివితేటలకు ఏడవాలో, నవ్వాలో తెలియలేదు ఆతల్లికి.

"కొంత కాలానికి ఏలాగైతేనేం, ఏదో ఒకలాగ ఆపిల్లకి పెళ్ళయింది. పిల్లను అత్తవారింటికి పంపేరోజు కూడా వచ్చింది. పిల్లకు చెప్పవలసిన వన్నీ చెప్పి, సాగనంపుతూ "అమ్మా! యిన్నాళ్ళు నువ్వు ఎన్నితప్పులు చేసినా మన యిల్లుకాబట్టి సరిపోయింది. ఇంక అత్తవారింట్లో ఆలా పనికిరాదు. వాళ్ళు చెప్పినట్లు తూ-చా, తప్పకుండా, నడుచుకోవాలి! అవుననీ కాదనీ చెప్పకూడదు. పుట్టినింటి గౌరవం కాపాడేలా మసులుకో అమ్మా!"అని కంట తడి పెట్టుకొని మరీ చెప్పింది వాళ్ళమ్మ.

"ఆలాగే నమ్మా!"

"అత్తవారింట్లో ఆడపిల్ల అణిగి మణిగి ఆకుల్లో పిందెలా వుండాలి సుమా!" అని ఆఖరుసారిగా హెచ్చరించి పంపించింది.

"అత్తవారింట్లో ఎలా మెలగాలో ఆపిల్ల దారిపొడుగునా వల్లించుకుంటూనే వుంది. తల్లి చెప్పిన మాటలో "అణిగి మణిగి ఆకుల్లో పిందెలా వుండాలి" అనే ఆఖరి మాటలు, మరిచిపోకుండా కంఠస్థం చేసుకొన్నది.

"అత్తవారిల్లు రానే వచ్చింది. ఇంట గుమ్మం దగ్గర కొత్తకోడలి కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. కాని — యీపిల్ల బండి దిగీ దిగడంతోటే గబగబా ఎవరినీ పలకరించకుండా, పెరట్లోకి పోయి అక్కడ దట్టంగా అల్లుకుపోయిన గుమ్మడిపాదు వుంటే, ఆ ఆకుల్లో పిందెలల్లే కూర్చుండిపోయింది. కొత్తకోడలు ఎంతకీ బయటకు రాకపోయేసరికి అత్తవారి తరఫువారికి, యిరుగుపొరుగు అమ్మలక్కలకు యిదేదో చాలా విడ్డూరమనిపించింది. అందరూ కలిసి దొడ్డినపడి వెదుకగా, వెదుకగా, చివరకు గుమ్మడి పాదులో కనిపించింది. అందరు ఆశ్చర్యపడి ఆపిల్లను యిదేమిటని అడిగారు.

"ఆపిల్ల సంగతంతా చెప్పేసరికి పొట్టలు చెక్కలయేటట్టు నవ్వుకున్నారు. ఇంత తెలివిలేని కోడలు దొరికినందుకు విచారించేరు. కొత్త కాబట్టి మెల్లిగా చెప్పి పాదులోనుంచి లేవదీసుకు వచ్చేరు. పాపం-ఆపిల్ల అత్తవారింట్లో అప్పుడే నగం లోకువయి పోయింది;

"ఓనాడు ఆపిల్ల అత్తగారు ఏదోపని తొందరలో వుండి కోడలిని పిలిచి "అమ్మా! చీకటి పడింది బొడ్డు నులిపి దీపంబెట్టు" మన్నది. 'నరే' అని ఆపిల్ల, అర్థం కాకపోయినా అడగడం మానేసి, దీపం బుడ్డి దగ్గర కూర్చుని తన బొడ్డు నులుపుకోవటం మొదలు పెట్టింది! ఎంతచీకటి పడినా దీపం వెలిగించకపోవడం గమనించి అత్తగారు లోపలికివచ్చి, ఆపిల్ల వాలకం చూసింది. "అయ్యో దేముడా! బొడ్డు నులపమంటే నీబొడ్డు నులుపుకుంటూ కూర్చున్నావా! బాగుంది! ఈ పాటి తెలివి తేటలు లేకపోతే ఎలా వేగడం నీతో? తెలియకపోతే అడగరాదూ" అని కేకలు వేసింది. ఆపిల్ల భయంతో మాట్లాడకుండా వూరుకుంది. "దీపం వత్తికి పట్టిన మసిని బొడ్డు అంటారు; అది తీస్తేనే గాని, దీపం బాగా వెలగదు. అది తీసి వెల్గించు!" అని కసిరి ఆవిడ వెళ్ళి పోయింది.

"ఎప్పటికైనా దారిని పడకపోతుందా అని అత్తగారు ఆపిల్లకు ఆపనీ ఈపనీ చెబుతూ నేర్పుతూ వచ్చింది. ఆపిల్ల మాత్రం ఎప్పటిదప్పుడే మరిచి పోతూ, ఏ రోజుకారోజు పరగడుపు అన్నట్లు వ్యవహారించేది.

"ఇలా వుండగా పోలాల మావాస్య వచ్చింది. పోలి తయారు చేయడానికి అత్తగారు ఆకుల్ని చక్కగా కుట్టి వాటిలో పిండిపెట్టి పొయిమీదికి ఎక్కించి కొడల్ని

పిలిచి "ముక్కుకి ఆవిరి పట్టగానే చూసిదింపు: లేకపోతే పాడవుతాయి" అని చెప్పి, అవతలకి వెళ్ళింది.

"ఇంక ఆపిల్ల అతి జాగర్తగా పొయ్యి దగ్గర కాచిపెట్టుకుని కూర్చుంది. కొంత సేపటికి పొయ్యి వేడిచేత ఆపిల్ల మొహం మంతా చెమట పోసింది. ముక్కుకి కూడా ఆవిరి తగిలి చెమట పట్టగానే, పోలిని దింపి అక్కడ పెట్టింది. భోజనాలు చేస్తున్నప్పుడు పోలి ఏమీ వుడకకపోవడం చూసి 'ఏమిటయిందని' అత్తగా రడిగింది!

"మీరు చెప్పినట్టుగా నేనా ముక్కుకి ఆవిరి పట్టగానే దించేసేను. లేకపోతే పాడవుతాయని చెప్పేరు కదూ?" అని తడుముకోకుండా సమాధానం చెప్పింది. అత్తగారామెను చడామడా తిడుతూ "నీకు నేరక చెప్పేనే'ముక్కు'అని! ఇంత పిండి వృత్తినే దండగయింది. ముక్కు అంటే నీ ముక్కు అనుకున్నావా దద్దమ్మా? ఇంత ఏబ్రాసి దానివని అనుకోలేదు. బుట్టల తాలూకు మూడికలని ముక్కులంటారు. అవి వుడకగానే వాటికి ఆవిరి పడుతుంది, అది చూసి దించాలి గానీ ఇలా తగలేస్తే బాగుంటుందా! నేనేదో మూట వరసకని ఆలా అంటే ఆపాటి తెలియక పోయిందా? ఇంత తెలివిలేని దాన్ని కూర్చేడు భగవంతుడు!— ఇంకా ఏమేమో యిలాగే నసపెట్టింది.

"ఆ నోటా ఈ నోట ఈ కబురు అందరికీ తెలిసి పోయింది. ఒకనాడామె వీధిలో కూర్చుండగా ఒక అమ్మలక్క వచ్చి 'మొగుణ్ణి కొట్టి మొగసాలెక్కినట్టు'ఏం ఆలా కూర్చున్నావు? అంత తెలీని దానివా? భోంచెయ్యడం తెలుసూ?" అని ఎగతాళిచేస్తూ అడిగింది. ఆమట్టుని మరింకకొర్తికైతే కోపం వచ్చునేమో కాని, ఈపిల్లకు ఏమీరాలేదు సరిగదా "మొగుణ్ణి కొట్టి మొగసాలెక్కడం అంటే ఏమిటిపిన్నీ" అని ముఖం యింత చేసుకు అడిగింది. ఇదే సమయం అని ఆ అమ్మలక్క—

"అంటే-ఒకవూళ్లో ఏమీ తెలియని పిల్ల ఒకర్తి వుండేది. వాళ్ళ అత్తారింట్లో ఏపనీ సరిగ్గా చేసేది కాదు! ఒకటంటే ఒకటి చేసి అన్నీ పాడుచేసేది! ఒకనాడు దాని మొగుడు మరి ఓర్వలేక చితగ తన్నేశాడు, ఆ దెబ్బలు పడలేక ఆమెకూడా ఒకటి కొట్టి భయంతో మొగసాల (అటక) ఎక్కి కూర్చుంది. అక్కడ కూర్చోడమేమిటి — ఆపిల్లకు ఎక్కడలేని జ్ఞానము వచ్చేసింది. ఎంతో తెలివితేటలు వచ్చేశాయి! ఇహ ఆనాటి నుంచీ ఆ పిల్లలా ఎవరూపనులు చేయలేక పోయేవారంటే నమ్మ. ఇప్పుడు తెలుసిందా?" అని ఎగతాళికి ఈమెను ఏడిపించాలని కథ అల్లి చెప్పింది. అది నిజమనుకొంది యీపిచ్చిపిల్ల.

"నిజమే తను ఎంతో తెలివి తక్కువ పిల్ల. తనకు ఏపనీ చేత కాదు! ఏలాగైనా తెలివితేటలు సంపాదించాలి. అంచేత ఒకసారి మొగుణ్ణి కొడితే తెలివితేటలు వస్తాయి. ఆ తర్వాత కావలిస్తే తెలివితేటలు వచ్చాక దానికోసం

(54-వ పేజీ చూడండి)



# మొగసాలెనెక్కిన మగువ ★

(33-వ పేజీ తరువాయి)

యిలా చేసేనని ఆయన్ని ప్రతి మాలుకొని చెప్పుకోవచ్చు అని ఆలోచించి, ఆలా చేయడానికే నిశ్చయించుకున్నది.

"రాత్రి ఆపిల్ల భర్త 'ఎందుకలాటి పనులు చేస్తావు రోజూ కొత్తేనా ?' అని అడిగేడు. ఆపిల్ల మాటాడకుండా వూగుకో డానికి బదులు, అదేనమయం అనుకొందో ఏమో-తీసి పెట్టి ఒక్క లెంపకాయ కొట్టింది. కొట్టగానే పోయి అటకమీద కెక్కి కూర్చుంది. వెంటనే ఆపిల్ల భర్తకి ఎక్కడలేని కోపం వచ్చింది. తను అడిగినదానికి చెప్పడం మాని కొట్టడంవరకూ వచ్చిందే అని, ఆమె జుత్తుపట్టుకు కింది కీడ్చి బాగా తన్నేశాడు. ఆమెకు ఇదంతా అయోమయంగా వుంది. అలా చేస్తే తనకు తెలివితేటలు వస్తాయను కొంది. కానీ - ఏదీ? ఏవీ తెలివితేటలు ? పైగా చచ్చేట్టు దెబ్బలు తగిలాయి.

"ఆపిల్ల భర్త ఆరాత్రి ఏలాగో గడిపి, దాన్ని యింకా యింట్లో వుంచితే ప్రాణం కూడా తీస్తుందేమోనని, మరునాటి వుదయాన్నే ఆమెను పుట్టింటికిపంపేసి అత్తగారికి ఈ సంగతులన్నీ చెప్పేడు.

"తల్లి యిదంతా గ్రహించి చాల విచారించింది. యింక వుండబట్టలేక కూతుర్ని నాలుగు తిట్టి, తనూ నాలుగు తిట్టుకుంది. అప్పటనుండి రాత్రింబగళ్ళు ఆలోచించింది —ఏంచేస్తే బాగుపడుతుందా అని. చటుక్కున ఒక వుపాయం తోచింది. ఇన్నాళ్ళు తనకూతురు చేసిన పొరపాట్లకి కారణం ఏమిటో ఆమెకు అప్పుడు తెలిసింది. వెంటనే కూతురితో సహా వియ్యాల వారింటికి బయలుదేరి వెళ్ళింది.

"వెళ్ళి ఆపిల్ల అత్తగారిని 'మా పిల్లని ఎందుకు పంపేశారు?' అని అడిగింది. అదివిని అందరు ఆశ్చర్యపోయారు-- తెలిసే ఎందుకు అడుగుతోందా అని.

"మా అమ్మాయి మీరు చెప్పినట్టు అక్షరమైనా తప్పకండి ఏపని చెయ్యలేదు?"అని రెట్టించిఅడిగింది

"మా బావుంది! ఏమిటమ్మా చేసింది? అది చేసినవన్నీ పాడు పనులే! పైగా ఆడది ఎదురు తిరిగి కొట్టడం కూడా ప్రారంభిస్తే ఏలా చావడం"అని అన్నారు అందరూ.

"అవును మాపిల్ల కొట్టింది తప్పే ! దానికసలే ఏం తెలియదు, ఎవరు ఏలా చెబితే అలాచేసే రకం - మీ వీధిలో అమ్మలక్క ఎవర్తో ఆలాచేస్తే తెలివి తేటలు వస్తాయని చెప్పిందట. ఈ వెఱ్ఱిపిల్ల ఆమాట నిజం అనుకొంది" "అది. విన్న వారందరూ ముక్కు మీద వేలేసుకున్నారు.

"నేను నిజం చెబుతున్నాను మాపిల్ల ఏలా చెబితే ఆలాగే చేస్తుంది. ఏలా గంటారా—నేనే చెప్పనుదానికి-అణిగిమణిగి ఆకుల్లో పిందెలా వుండాలని. అదివిని మాపిల్ల అందులో అక్షరమైనా బీరుపోకుండా మీయింటికి రావడంతోనే గుమ్మడిపాదు మధ్య అణిగి మణిగి ఆకుల్లోపిందెలా కూర్చుంది- యిదితప్పా?"

"తరవాత బొడ్డునులిపి దీపం పెట్టమంటే, అది తన బొడ్డు అని అనుకొంది. అంచేత ఆలా చేసింది. అది దాని తప్పా?

"ఆ తరువాత ముక్కుకి ఆవిః పట్టగానే దింప మన్నారు పోలిని. తన ముక్కు అనుక్కుని ఆవిః పట్టగానే దింపేసింది ! ఇందులో మాత్రం మా పిల్లదేం తప్పుంది! మీరెలా చెబుతే అలాగే చేసింది. ప్రపంచ జ్ఞానం లేని పిల్లకి అవన్నీ ఏం తెలుస్తాయి. తిన్నగా బోధపడేటట్లు చెప్పక సామెతలతోను, శ్లోకాలతోను చెప్పడం మనదే తప్పు ! యీ విధంగా ఆలోచిస్తే మాపిల్ల చేసినవేవీ తప్పులేదు. తు - చ - తప్పకండా, నడిచింది. కాబట్టి యిదిగో దాన్ని మీకు తిరిగీ అప్పచెప్పు తున్నాను. ఇహ మీదట దానికి బోధపడేట్టు చెప్పి చేయించు గోడం మీదేపూచీ. సామెతలూ, శాస్త్రిలూ చెప్పకండి!" అని చెప్పి వెళ్ళిపోయింది.

"ఆమె చమత్కారానికి అందరూ ఆనందించి కోడల్ని మళ్ళీ తీసుకున్నారు. ఆనాటినుండి, ఆపిల్ల అత్తగారు తన తప్పుని కూడా తెలుసుకొని దగ్గరుండి పనులు చెబుతూ, శాస్త్రాలు సామెతలూ వల్లించకుండా జాగ్రత్తపడి, పిల్లకు అన్ని పనులూ నేర్పింది. ఈమె సంగతి తెలుసు గాబట్టి ఆమె భర్త కూడ ఆదెబ్బని మరచి పోయేడు. అందరు సుఖంగా వున్నారు. ఇంకకథ కాశికి మనం మంచం మీదకి" అని చెప్పి వూరుకుంది—

"బావుందికథ;" అందిపాపాయి.

"నువ్వు కూడా ఆపిల్ల లాగే చేస్తావా;"

"ఛీ-" ★